ఇసుక రవాణాపై నిఘా

- ఎక్కడికక్కడే కట్టడి
- అయినా జిల్లాలో ఆగని దందా
- కాసుల కక్కుర్తితో అక్రమార్కులు



ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

సిరిసిల్లక్రైం: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నారు. అయినా ఇసుకాసురులు ఆగడం లేదు. పర్మిషన్ ఒక ప్రాంతానికి తీసుకుంటే మరో ప్రాంతానికి తరలించి క్యాష్ చేసుకుంటున్నారు. అనుమతులు లేకుండా తరలిస్తే కేసులు నమోదు చేసినా వారిలో మార్పు రావడం లేదు. గతేడాది అక్రమంగా ఇసుక రవాణా చేసిన 259 వాహనాల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ ఏడాదిలో రెండునెలల్లో 30 వరకు కేసులు నమోదు చేశారు. అయినా రాత్రివేళ జిల్లాలో ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. ఇటీవల ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ సీరియస్‌గా వ్యవహరిస్తుండడంతో పోలీసులు సైతం తనిఖీలు ముమ్మరం చేశారు.

జరిమానాతోపాటు జైలు

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే గతంలో జరిమానాలు విధించేవారు. అయినా ఇసుక స్మగ్లర్లలో మార్పు రావడం లేదని అధికారులు మరింత సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. కొద్దికాలంగా ట్రాక్టర్ యజమానితోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ తరలిస్తున్నారు.

అనుమతి ఒకటి.. సరఫరా ఇంకో చోటికి !

జిల్లాలో స్థానిక అవసరాలు, ప్రభుత్వ పనులకు ఇసుక కొరత ఉందని కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల ప్రోద్బలంతో అధికారులపై ఒత్తిడి తెస్తూ ఇసుక వ్యాపారులు దందా సాగిస్తున్నారు. మానేరు మూలవాగు నుంచి ఇసుక సరఫరాకు అనుమతులు తీసుకుంటూ ప్రైవేట్ పనులకు చుట్టుపక్కల గ్రామాలకు సరఫరాచేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు.

2024లో కేసులు ఇలా

ఇసుక కేసులు	268
రిమాండ్	195
సీజ్ చేసిన వాహనాలు	308

2025లో ఇప్పటి వరకు

ఇసుక కేసులు	18
రిమాండ్	22
సీజ్ చేసిన వాహనాలు	18

ఇసుక అక్రమ రవాణా ఆగాలి



జిల్లాలో ఇసుక అక్రమ రవాణా నిలిచిపోయేలా చర్యలు ఉండాలని జిల్లాలోని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధికారులు సూచించిన ప్రాంతంలోనే ఇసుకను అధికారిక అనుమతితో నిర్మాణ పనులకు తీసుకెళ్లాలి. నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించేలా ఆదేశాలిచ్చాం.

– సందీప్‌కుమార్ ఝా, కలెక్టర్

నిబంధనలు అతిక్రమిస్తే రిమాండ్



జిల్లాలో ఇసుకను అనధికారికంగా తరలించే వారిపై గతంలో జరిమానాలు విధించాం. ప్రస్తుతం ట్రాక్టర్ డ్రైవర్ తోపాటు ఓనర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ తరలిస్తున్నాం. సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకుని డ్రైవింగ్ లైసెన్స్ వాహన ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే ఇసుక రవాణా చేయాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

కుల గణనలో అందరూ వివరాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న హన్మాండ్లు

సిరిసిల్ల: రాష్ట్రంలో జరుగుతున్న కులగణన రీసర్వేలో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, గతంలో పాల్గొనని వారంతా వివరాలు నమోదు చేసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు కోరారు. సిరిసిల్ల బీసీ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీలో చట్టం తేవాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని హన్మాండ్లు గుర్తు చేశారు. అదే చిత్తశుద్ధితో రీసర్వే లో పాల్గొనాలన్నారు. ఈనెల 28 వరకు జరిగే రీ సర్వేలో గతంలో పాల్గొనని వారంతా పాల్గొనాలని పర్శ హన్మాండ్లు కోరారు. బీసీలు విధిగా సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. బీసీ బిల్లు పెట్టి చట్టం చేస్తే బీసీలకు వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుకు అవకాశం ఉందన్నారు. బీసీసంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేణి మల్లేశ్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు తడిక కమలాకర్, జిల్లా నాయకులు తోట్ల రాములు, తిరుపతి, బచ్చు ప్రసాద్, రవి,శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలి



బోయినపల్లిలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

బోయినపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యంగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, సంబ లక్ష్మీరాజం, ఏనుగుల అనిల్‌కుమార్, నాగుల వంశీ, బోయిని పర్శరాములు, మల్లేశం, ఎండీ.రఫీ, మండల నరేశ్, ఇనిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాన్వాడ రాంచంద్రారెడ్డి, నజీర్, రాజశేఖర్, సాయి రెడ్డి తదితరులు ఉన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని రుద్రవరంలో మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ మేనేజ్‌మెంట్ వేములవాడ అర్బన్ మండల ఇన్‌చార్జి నార్ల సాయికుమార్, బియ్యాల మధు తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు



కందకం తవ్విస్తున్న రెవెన్యూ అధికారులు

తంగళ్లపల్లి: అనుమతి లేకుండా మానేరు నది నుంచి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ (ఎఫ్ఏసీ) జయంత్‌కుమార్ అన్నారు. మండలంలోని కస్బేకట్కూర్ గ్రామ మానేరు వాగు లోకి ట్రాక్టర్లు వెళ్లకుండా మంగళవారం జేసీబీతో రెవెన్యూ అధికారులు కందకం తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని నిర్మాణాలకు సిరిసిల్ల నుంచి వే బిల్లులు ఇస్తున్నామని, మానేరు నదిలో నీరు నిలిచి ఉండడం మూలంగా ఇసుక రీచ్ నుంచి తాత్కాలికంగా అనుమతులు నిలిపివేశామన్నారు. దీనిని అదునుగా చూసుకొని అక్రమ రవాణాకు తెగబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ తీగలను సరిచేస్తాం

సాక్షి స్పందన

సిరిసిల్ల: చందుర్తి మండలం మూడపల్లి, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి మధ్య విద్యుత్‌తీగలు ప్రమాదకరంగా ఉండగా మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సిరిసిల్ల సెస్ ఎండీ విజయేందర్‌రెడ్డి మూడురోజుల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేస్తామన్నారు. మర్రిపల్లి శివారులో మారుతీ రైస్ మిల్లు వద్ద ప్రమాదకరంగా ఉన్న ఈ విద్యుత్ లైన్‌ను వేములవాడ రూరల్ ×సెస్₹ అధికారులు సరిచేసేలా ఆదేశాలు జారీచేసినట్లు 'సెస్' ఎండీ స్పష్టంచేశారు.

దుండగులను శిక్షించాలి



ఎల్లారెడ్డిపేట: దుమాల గ్రామ శివారు మడేలేశ్వర స్వామి ఆలయ మెట్లను మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా దుండగులను గుర్తించి, శిక్షించాలని జిల్లా రజక సంఘం అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. రజక సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన రజకులు మండల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగ్గురిపై కేసు

దుమాలలో గుడిమెట్లను కూల్చిన సంఘటనలో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన రామింట్ల దేవాదానం, అరటి సంతు, అరటి ఎల్లయ్య గుడి మెట్లను కూల్చి స్తంభాలు పడగొట్టగా ఘటనపై ఆలయ కమిటీ చైర్మన్ ధర్మారం సతీశ్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడి రిమాండ్

తంగళ్లపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావును మంగళవారం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల నేరెళ్ల పీహెచ్‌సీలో టీకా వికటించి చిన్నారి చనిపోయిందని తల్లిదండ్రులు నిరసనకు దిగగా వారికి మద్దతుగా వెళ్లిన శ్రీధర్ రావును మంగళవారం అరెస్టు చేశారు.

సంక్షిప్త వార్తలు

● **ప్రభుత్వ కళాశాలల్లోనే చేరండి**

ఇల్లంతకుంట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే విద్యార్థులు చేరాలని ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే దేవరాజం విద్యార్థులను కోరారు. మంగళవారం మండలంలోని ఇల్లంతకుంట, వల్లంపట్ల, కందికట్కూర్, పాత్తూరు, గాలిపెల్లి, గ్రామాల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాలలో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులకు వివరించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● **గర్జనపల్లి అడవిలో ఎల్లమ్మ తల్లి విగ్రహం**

వీర్నపల్లి: గర్జనపల్లి అడవిలో ఎల్లమ్మ తల్లి ప్రతిమ బయటపడటంతో గ్రామస్తులు మంగళవారం అక్కడికి వెళ్లారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకోగా స్థానికులతో వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం భక్తులు పూజలు చేశారు. ఈ విషయమై ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వేణును వివరణ కోరగా గ్రామంలోని కొందరు కావాలనే విగ్రహం అడవి ప్రాంతంలో ఉంచి, అక్కడి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. అడవిలో ఆలయాలకు, నిర్మాణాలకు అనుమతులు లేవన్నారు.

● **కేంద్ర బడ్జెట్‌పై నిరసన**

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో రాష్ట్ర వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా మంగళవారం నిరసన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు, గ్రామీణ ఉపాధి హామీ మహిళలు నిరసనలో పాల్గొన్నారు. గతంలో చేసిన ఉపాధి కూలీ డబ్బులు రాలేదని మహిళలు వాపోయారు. సీపీఎం కార్యవర్గ సభ్యురాలు జవ్వాజి విమల, సభ్యులు మ్యాదరి దేవేంద్ర, తుమ్మల దేవలక్ష్మి, కటికెల స్వప్న, నాగలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

● **తప్పుడు ప్రచారం మానుకోవాలి**

ఎల్లారెడ్డిపేట: కాళేశ్వరం 9వ ప్యాకేజీకి వస్తున్న నీటిపై బీఆర్‌ఎస్ నాయకులు అవాస్తవాలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదో ప్యాకేజీ ద్వారా ఎస్సారెస్పీ నీరు వస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు కాళేశ్వరం నీరు వస్తుందని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్సారెస్పీ నీటిని వరదకాల్వ ద్వారా మిడ్‌మానేరు ప్రాజెక్టులో నింపుతున్నట్లు పేర్కొన్నారు. మిడ్‌మానేరు నుంచి మల్కపేటకు ఎస్సారెస్పీ నీటిని తరలించి పంటలను కాపాడుతున్నామన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

● **విద్యార్థులకు అవగాహన**

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా ఆసక్తి పెంపొందించేందుకు కేవైఈ ద్వారా కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సెలెంట్ కో ఆర్డినేటర్ సాయి మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆకాష్, శాటిలైట్‌లోని చంద్రయాన్, ఓ షార్ట్, ఆర్యభట్ట, జీఎస్ఎల్వీ, ఏఎస్ఎల్వీ లాంటి వాటిపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు,హెచ్ఎం రాజరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

● **రికార్డులు ఎందుకు తగులబెట్టారు?**

చందుర్తి: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ రికార్డు బుక్స్‌ను గత శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వెనుకాలో తగులబెట్టారు. కార్యాలయం సిబ్బంది స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం కార్యాలయంలో ఉన్న పాత కాగితాలు, పనికిరాని ఇతర పత్రాలను దహనం చేశారు. వీటితో పాటు ఉపాధి హామీ రికార్డులను ఎందుకు తగులబెట్టారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఏపీవో రాజయ్యను వివరణ కోరగా 2006వ సంవత్సరం రికార్డులు చెదలు పట్టడంతో దహనం చేశామని తెలిపారు. కానీ 2019–20 రికార్డులు దహనం చేశారని, రికార్డుల దహనం చేస్తున్న సమయంలో సాక్షి సేకరించిన ఫొటోను అధికారికి చూపిస్తే రికార్డులు చెదలుపట్టాయని, సిబ్బంది చూడకుండా దహనం చేశారని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది.

● **రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు**

కోనరావుపేట: నిమ్మపల్లిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. నిమ్మపల్లికి చెందిన మల్యాల సురేశ్ ద్విచక్రవాహనంపై లిఫ్ట్ అడిగి వెళ్తుండగా నిమ్మపల్లి శివారు వైన్స్ సమీపంలో కారు, బైక్ ఢీకొంది. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం 108లో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

హామీలు అమలు చేయాలి



పోస్టుకార్డులతో ఉద్యమకారులు

సిరిసిల్లటౌన్: ఉద్యమకారులకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్ కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో పోస్టు కార్డు ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తూ మాట్లాడారు. రానున్న అసెంబ్లీ సమావేశాలలో 250 గజాల స్థలాన్ని ఉద్యమకారులకు కేటాయించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు ఆకునూరి శంకరయ్య, వెంగళలక్ష్మణ్, కుంభాల మల్లారెడ్డి, కొండశంకర్, కొక్కుల ఆంజనేయులు, బింగి ఇజ్జగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



ముస్తాబాద్: తనను గెలిపిస్తే విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యర్రగుంట అశోక్‌కుమార్ కోరారు. మంగళవారం మండలకేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడు తూ... ఉపాధ్యాయ సంఘాల నాయకులు వడ్లకొండ చంద్రం, హన్మంత్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీ నివాస్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

'తడగొండ' చిత్రపటం ప్రదర్శన

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ పంచాయతీ భవనంలో సిరిసిల్ల ప్రభుత్వ వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం గ్రామ చిత్రపటంతో గ్రామంలోని వనరులు ప్రదర్శించారు. గ్రామీణ భాగస్వామ్య పరిశీలనలో భాగంగా రైతులతో సమావేశమై గ్రామంలో ఉన్న వనరులు, అభివృద్ధి ఇతర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిందం రమేశ్, మాజీ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, సింగిల్‌విండో డైరెక్టర్ గుడి శ్రీనివాస రెడ్డి, గుడి రవీందర్‌రెడ్డి, బుర్ర రాజు, సారబుడ్ల నర్సింహారెడ్డి, ఆముదాల రాజిరెడ్డి, లచ్చిరెడ్డి, చెంద్రారెడ్డి, ముదాం కమలాకర్, తడగొండ రాజేశ్, విద్యార్థినులు ఎండీ పర్వీన్, సల్మాని, రంగు వర్ష, మాలోతు తేజస్విని, నవ్యశ్రీ తదితరులు ఉన్నారు.

గుంత పూడ్చివేత



గుంతను పూడ్చుతున్న జర్నలిస్టులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై పదిర వద్ద వంతెనపై ప్రమాదకరంగా ఉన్న గుంతను మంగళవారం మండలానికి చెందిన జర్నలిస్టులు పూడ్చివేశారు. మంగళవారం సిమెంట్, కంకరతో వారు గుంతను పూడ్చివేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి శ్యా మంతుల అనిల్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



సన్మానిస్తున్న అర్చకులు

చందుర్తి: మండలంలోని బండపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ కార్యవర్గ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వీడీసీ కమిటీ అధ్యక్షుడు కటకం చంద్రయ్య తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా గడ్డం తిరుపతిరెడ్డి, కోశాధికారిగా తాడిశెట్టి తిరుపతిరెడ్డి, కార్యదర్శిగా కుమ్మరి దయాకర్, 16 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆలయ అర్చకులు కొదంగుల్లా శ్రీకాంతచార్యులు, ఆలయకమిటీ మాజీ చైర్మన్లు ఏనుగు లచ్చిరెడ్డి, కటకం మల్లేశం, గడ్డం సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నలుగురి రిమాండ్

సిరిసిల్ల క్రైం: పట్టణానికి చెందిన నలుగురు యువకులు గంజాయితో పట్టుబడటంతో వారిపై కేసునమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సిరిసిల్లటౌన్ సీఐ కృష్ణ తెలిపారు. పట్టణానికి చెందిన అంకార్ ప్రణీత్, గొల్లపెల్లి కార్తికేయన్, ఆకునూరి శివాజీ, ఆకునూరి మణిదీప్ గంజాయికి అలవాటు పడి గతంలో జైలుకెళ్లి వచ్చారు. వీరంతా కరీంనగర్‌లో ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి తాగారు. మిగిలిన గంజాయిని సిరిసిల్ల మానేరు వాగు పక్కనున్న మడేలమ్మ ఆలయం సమీపంలో దాచిపెట్టారు. మంగళవారం గంజాయి తాగేందుకు యత్నిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు వారిని పట్టుకున్నారు. 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.



చందుర్తి: మండలకేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం దుమ్ముతో నిండిపోయింది. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బస్‌షెల్టర్‌లో దుమ్మంతా చేరిందని ప్రయాణికులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఈ బస్‌షెల్టర్ మరమ్మతుకు గ్రామపంచాయతీ నిధులనుంచి రూ.లక్షకు పైగా వెచ్చించినా ప్రయోజనం లేకుండా పోతోందని గ్రామస్తులు తెలుపుతున్నారు. కార్మికులతో రోజూ బస్‌షెల్టర్‌ను శుభ్రం చేయించి ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సెల్ నెం: 9676989692

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



చందుర్తి : పతకాలు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు



వేములవాడ అర్బన్ : విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాజరత్నం

చందుర్తి: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మండలంలోని మూడపల్లి, నర్సింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన బాలికలు బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు స్పార్క్ కుంగు ఫూ అకాడమీ మాస్టార్ నేరెళ్ల శ్రీధర్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆల్ స్టైల్ కరాటే, కుంగ్ ఫూ పోటీల్లో మండలంలోని మూడపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు 12 గోల్డ్‌మెడల్, నర్సింగాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 6 గోల్డ్ మెడల్ సాధించారన్నారు. సీనియర్ గ్రూప్ విభాగంలో మూడపల్లి విద్యార్థులు ఐశ్వర్య, స్నేహిత, చందన, రిషిత, రక్షిత, హరీశ్, అఖిల, అక్షర ప్రభ, శ్రీచరిత, లిఖిత, ఆకర్షణ, నర్సింగాపూర్ పాఠశాలకు చెందిన వర్ష, అశ్విని, అక్షయ, జోష్న, రిశ్విత పతకాలు సాధించారు. వీరిని కరాటే మాస్టర్ శ్రీధర్ గౌడ్‌తో పాటు ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, జితేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల సిరిసిల్లలో జరిగిన కరాటే పోటీల్లో విద్యార్థులు కృష్ణ చైతన్య, ప్రవీన్, హరీశ్ పాల్గొని మోడల్ సాధించి, ప్రసంసాపత్రాలు అందుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు రాజరత్నం విద్యార్థులను అభినందించారు. విద్యార్థులురాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. పీడీ హమీద్, తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం



ఇల్లంతకుంట: పొత్తూరులో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ముస్తాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా గంభీరావుపేట మండలంలో బీజేపీ నాయకులు మంగళవారం ప్రచారం చేపట్టారు. బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి మద్దుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. దేవసాని కృష్ణ, కృష్ణకాంత్, రాజుగౌడ్, స్వామి, రవి, సత్యనారాయణ, రమేశ్, విఘ్నేశ్, నర్సింలు, భాస్కర్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్, పొత్తూరు, ఇల్లంతకుంట, గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్కా కొమురయ్యకు ఓటు వేయాలని ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో మానకొండూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఏనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుర్రాల వెంకటరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్, బూత్ అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, శ్రీకాంత్, దేశెట్టి శ్రీనివాస్, నాయకులు బత్తిని స్వామి, గుంటి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వేములవాడ రూరల్: ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని హన్మాజిపేట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.దివ్యశ్రీ అన్నారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలో పద్మపాని సొసైటీ కరీంనగర్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గ్రామంలోని 50 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సాయి వైష్ణవి, ఏఎన్ఎం వసంతకుమారి, ఆశాలు స్వర్ణలత, లావణ్య, పద్మపాని జిల్లా కోఆర్డినేటర్ రమేశ్, సూపర్‌వైజర్ సుదర్శన్, ఎల్‌డబ్ల్యూఎస్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సమాచారం ఇవ్వాలి

ఎల్లారెడ్డిపేట: మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడితే వెంటనే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. వేసవిలో ఎక్కువగా గాలి దుమారం వీచి కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. సమాచారం ఇవ్వాలని కోరారు.

వేంకటేశ్వర స్వామి ఆలయం ముస్తాబు

చందుర్తి: మండలంలోని మూడపల్లిలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం బుధవారం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ దాత, శాశ్వత చైర్మన్ జేపీరావు తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివారి కల్యాణానికి చుట్టుపక్కల గ్రామాల భక్తులే కాకుండా కరీంనగర్, హైదరాబాద్ పట్టణాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నట్లు చెప్పారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని విజ్ఞాన్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను మంగళవారం ఎంఈవో కృష్ణహరి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ మార్చి 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ఉన్నందున విద్యార్థుల ఇంటర్నల్ మార్కులు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: 9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : శ్రీకాంత్ - 6281700456
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899